క్లుప్తంగా

డయల్ యువర్ డీఎంకు నాలుగు వినతులు

చీరాల అర్బన్: డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి నాలుగు వినతులు అందాయని డిపో మేనేజర్ జె.శ్యామల తెలిపారు. మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. తిమ్మసముద్రం మీదుగా ఇంకొల్లుకు అదనపు బస్సు నడపాలని, చీరాల నుంచి పర్చూరు మీదుగా ఇంకొల్లుకు బస్సు ఏర్పాటు కోరారని చెప్పారు. చీరాల నుంచి షాపూరుకు పాత బస్సు స్థానంలో కొత్త బస్సు ఏర్పాటు చేయాలని, ముప్పవరం నుంచి బాపట్లకు కొత్త బస్ సర్వీసు నడపాలని ప్రయాణికులు కోరారు. ప్రయాణికుల నుంచి వచ్చిన వినతులను త్వరలోనే పరిష్కరిస్తామని డిపో మేనేజర్ తెలిపారు.

వాహనాన్ని ఢీ కొన్న పార్శిల్ లారీ



ప్రమాదంలో దెబ్బతిన్న పార్శిల్ లారీ

మేదరమెట్ల: డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టడంతో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జాతీయ రహదారి చెన్నపట్నం ఫిల్టర్ కాఫీ ఎదురుగా మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. విజయవాడ నుంచి ఒంగోలుకు పార్శిల్ లోడుతో లారీ వెళ్తోంది. సరిగ్గా లారీ మేదరమెట్ల తమ్మవరం ఫ్లై ఓవర్ బ్రిడ్జి దాటగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ముందు వెళుతున్న మరో వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ పక్కన ఉన్న మరో డ్రైవర్ సుధాకర్ కాలికి తీవ్ర గాయమైంది. సమాచారం తెలుసుకున్న మేదరమెట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

డిజిటల్ మైక్ బహూకరణ



డిజిటల్ మైక్‌తో ఉపాధ్యాయులు

వేటపాలెం: దాతల సహకారంతో అక్కాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు డిజిటల్ మైక్‌ను మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం భవనం భద్రిరెడ్డి మాట్లాడుతూ విశ్రాంత ప్రిన్సిపాల్ బత్తుల బ్రహ్మారెడ్డి, రూ. 8 వేలు, ఉపాధ్యాయురాలు బిట్రా అనురాధ రూ. 5.300, గాదె శ్రీనివాస రెడ్డి రూ. 5,300 ఈ ముగ్గురు దాతలు కలిసి అందజేశారని తెలిపారు. దాతలకు స్కూల్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

290 మంది స్వాములకు అన్నదాన వితరణ



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల పాత గుంటూరు రోడ్డులో గల గణపతి మురుగన్ అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరుగుతోంది. అందులో భాగంగా మూడో రోజు మంగళవారం 290 మంది స్వాములకు అన్నదానం చేసినట్లు చెప్పారు. ఇందుకు రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, వైవీ భద్రారెడ్డిల కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించినట్లు సేవా సమితి నిర్వాహకులు తెలిపారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి



సుబ్బారావు కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుడు మేకా సుబ్బారావు (84) అనారోగ్యంతో సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయన మృతి పట్ల తహసీల్దార్ కే రవికుమార్, డీటీ విష్ణు, మస్తాన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ టీ భాస్కరరావు, వీఆర్వో వసంతరావు, మండల వీఆర్ఏ సంఘం అధ్యక్షుడు మేకా అశోక్ మిగిలిన సిబ్బంది నివాళులర్పించారు. అతనికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు నగదు కుటుంబ సభ్యులకు అందజేసి ఓదార్చారు.

ఆధార్ కోసం ప్రత్యేక క్యాంపులు

చీరాల టౌన్: మండల ప్రజలకు ఆధార్ అప్‌డేట్ కోసం ప్రత్యేకంగా గ్రామ సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శివసుబ్రమణ్యం మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. చీరాల మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉన్న 22 గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో సూచించారు.

నాడు దర్జాగా..
నేడు దీనంగా

- రైతు సేవా కేంద్రాల్లో నిరుపయోగంగా కియోస్క్ మెషిన్లు
- నియోజకవర్గంలో 87 కేంద్రాల్లో దిష్టిబొమ్మగా ఉన్న వైనం
- ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్న రైతులు
- ఎరువులు, పురుగు మందులు అందక రైతుల అవస్థలు

అద్దంకి: నాడు రైతులకు మేలు చేకూర్చిన కియోస్క్ యంత్రాలు నేడు మూలనపడి వెక్కిరిస్తున్నాయి. ఆధునిక సాంకేతికతతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కించింది. ఫలితంగా ఐదేళ్లు రైతు దర్జాగా రారాజుగా బతికాడు. గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లోనే రైతులకు అన్నీ అందేవి. కాని ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం అతివృష్టి, అనావృష్టితో అల్లాడుతోంది. అత్యంత ప్రాధాన్య రంగాలైన విద్య, వ్యవసాయం, వైద్యం రాష్ట్రంలో కుంటుపడింది. కేవలం మాయమాటలతో, అభూత కల్పనలతో, పచ్చ మీడియాతో అబద్ధపు రాతలతో రాజ్యమేలుతూ కాలం గడుపుతోంది కూటమి ప్రభుత్వం. అద్దంకి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు విత్తనాలు, ఎరువులు స్పాట్ బుకింగ్ కోసం ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు మూలనపడ్డాయి. వాటి వాడకం లేకపోవడంతో కొన్ని చోట్ల మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. మరో వైపు గత ప్రభుత్వ హయాంలో విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందించగా ఈ ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలను డొల్ల కేంద్రాలుగా మార్చి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడంలో విఫలమైంది. దాంతో రైతులు అధిక ధరలకు విత్తనాలు, ఎరువులను ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేసి జేబుకు చిల్లు పెట్టుకుంటున్నారు.

విత్తన పంపిణీ మిథ్యే..

గత ప్రభుత్వ హయాంలో కియోస్క్ మెషిన్ ద్వారా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 87 రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రతి రైతులకు గ్రామంలోనే అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో తక్కువ ధరకు రాయితీపై అందించారు. అయితే నూతన ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలను పట్టించుకోవడం లేదు. ఇక్కడ ప్రస్తుతం పిల్లిపెసర్లు పంపిణీ మినహా, వరి విత్తనాలు, కందులు, మొదలైన విత్తనాలను రైతులకు అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తమది రైతు ప్రభుత్వం అని చెప్పుకునే నూతన ప్రభుత్వం ఇప్పటికైనా రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్ మెషిన్లను వినియోగంలోకి తెచ్చి, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రాయితీపై అందించాలని రైతులు కోరుతున్నారు.



కొప్పెరపాలెం రైతు భరోసా కేంద్రం



నిరుపయోగంగా మారిన కియోస్క్ మెషిన్

అధిక ధరలకు కొనుగోలు చేశాం..

గతం ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యమైన విత్తనాలు ఇచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం విత్తనాల పంపిణీ ఊసే ఎత్తలేదు. కేంద్రాల్లో మెషిన్లను కూడా పట్టించుకోలేదు. వరి విత్తనాలు దొరక్క దర్శి వెళ్లి ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి కలిగింది.

– ఎం రామయ్య, తిమ్మాయపాలెం

విత్తనాలు అందించాలి..

కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు. ఇంత వరకూ వరి విత్తనాలు ఇవ్వలేదు. శనగ వేసే అదును వచ్చింది. శనగ విత్తనాలు పంపిణీకి సిద్ధం చేయలేదు. మరో వైపు ఆధునిక పరిజ్ఞానంతో ఉన్న కియోస్క్ మెషిన్లు మూలనపడ్డాయి. గతంలో విత్తనాలు, ఎరువులు గ్రామంలోనే లభిస్తే ఇప్పుడు పట్టణాలకు వెళ్లి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి కలుగుతోంది.

– ఏ మురళి, తిమ్మాయపాలెం

త్వరలో శనగలు పంపిణీ చేస్తాం..

త్వరలో శనగలు పంపిణీకి సిద్ధం చేస్తున్నాం. కియోస్క్ మెషిన్లను వినియోగంలోకి తేనున్నాం. వరి విత్తనాలు అందుబాటులో లేవు. పనిచేయని మెషిన్లను మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తాం.

– ఏడీఏ ధన్‌రాజ్

అణగారిన వర్గాల్లో వెలుగులు నింపిన శంకరన్

చీరాల రూరల్: బడుగుల బాంధవుడిగా పేరుగాంచి అణగారిన వర్గాల బతుకుల్లో వెలుగులు నింపిన మహనీయుడు రిటైర్డు ఐఏఎస్ అధికారి ఎస్ఆర్. శంకరన్ అని పలువురు వక్తలు కొనియాడారు. శంకరన్ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం విజయనగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ముందుగా నాయకులు ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దుడ్డు భాస్కరరావు, బి. లక్ష్మీ నరసయ్య, గొర్రెపాటి రవికుమార్, తేళ్ల సుబ్బారావు, దుడ్డు సుందరరావులు మాట్లాడారు. శంకరన్ ఐఏఎస్ అధికారిగా పనిచేసిన కాలంలో దళిత, ఆదివాసిల సంక్షేమం కోసం, వారి అభివృద్ధికి బాటలు వేశారని పేర్కొన్నారు. ఒక్క ఏడాదిలో 120 పైగా జీవోలు అమలు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కారంచేడులో జరిగిన ఘటనలో బాధితులకు ప్రభుత్వానికి మధ్య వర్తిత్వం వహించి 436 గృహాలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వారికి ఎంతో మేలు చేశారన్నారు. అప్పట్లోనే బాధితులకు స్వయంకృషి ప్రాజెక్టు రూ.1 కోటితో ఏర్పాటు చేయించిన ఘనత ఆయనదేనన్నారు. గ్రామానికి చేసిన మేలును దృష్టిలో పెట్టుకుని ఆయన విగ్రహాన్ని ఆయనను స్మరించుకునేందుకు గ్రామంలో నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు లక్ష్మీప్రసాద్, దేవదానం, యేసుపాదం, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, పెదలక్ష్మయ్య, అబ్రహం, యాకోబు, మార్క్, జోసఫ్, వందనం, యేహోను, పాల్, రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శంకరన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విజయనగర్ కాలనీవాసులు

క్రీడలతో జీవితంలో మనోధైర్యం పెంపు

వేటపాలెం: క్రీడల్లో పాల్గొంటే మనోధైర్యం లభిస్తుందని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో తైక్వాండో క్రీడాకారుల ఎంపిక పోటీలను మంగళవారం సీఐ ప్రారంభించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. ఇంటర్ కాలేజీ టోర్నమెంట్ సెక్రటరీ జీపి రాజు మాట్లాడుతూ కళాశాల నుంచి ప్రతి ఏడాది ప్రతిభ గల ఉత్తమ క్రీడాకారులు యూనివర్సిటీ స్థాయిలో మొదటి స్థానంలో నిలుస్తున్నారని చెప్పారు. గతంలో స్పోర్ట్స్ అండ్ వెల్‌నెస్ కింద విద్యార్థులకు 0.5 క్రెడిట్ ఇచ్చారని, దానిని ఈ ఏడాది నుంచి 1.5 క్రెడిట్స్‌గా పెంచబోతున్నట్లు తెలిపారు. అనంతరం తైక్వాండో క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీష్‌బాబు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ రమణమూర్తి, యూనిర్సిటీ కోచ్ ధనేశ్వరరావు, తైక్వాండో ఇన్‌స్ట్రక్టర్ ఎన్ తులిసి, పీడీ ఏ శ్రీనివాసరావు, సయ్యద్ సలావుద్దీన్, షేక్ అబ్దుల్ సలాం, ముఖేష్, ఏ అఖిల్ పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న రూరల్ సీఐ శేషగిరిరావు

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు



రెవెన్యూ సదస్సులో సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో అఖిల



దేవరపల్లిలో తహసీల్దార్‌కు అర్జీలందిస్తున్న గ్రామస్తులు

కేశవరప్పాడు (కారంచేడు): భూసమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు ఏర్పాటు చేశామని చీరాల ఆర్డీవో దేవరకొండ అఖిల అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని కేశవరప్పాడు గ్రామంలో ఏర్పాటు చేసిన భూముల రీ సర్వే గ్రామ సభలో రైతులు, ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. కొంత మంది రైతులకు చెందిన భూములు ఆన్‌లైన్‌లో తక్కువగా చూపడం, మరికొంత మంది రైతులకు భూములు ఎక్కువగా చూపించడం, మరికొందిరివి ఆన్‌లైన్ అవ్వకపోవడం వంటి సమస్యలున్నాయన్నారు. అలాగే భూముల విస్తీర్ణంలో తేడాలు, నమోదుల్లో పేర్లు తేడాలు, ఆన్‌లైన్ అప్‌డేట్ సమస్యలున్నాయన్నారు. భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నామన్నారు. చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టామని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీ ధనలక్ష్మి, ఇన్‌చార్జ్ తహసీల్దారు అనిత, కార్యాలయ సర్వే ఇన్‌స్పెక్టర్ ముసలయ్య, డిటీ సర్వే సుబ్బారావు, మండల సర్వేయర్ సత్యన్నారాయణ, వీఆర్ఓ శివకుమమార్, సర్వేయర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభలో 15 అర్జీలు

జే.పంగులూరు: రీసర్వే జరిగిన గ్రామాల్లో తప్పులు ఉంటే సరిచేసుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని తహశీల్దార్ సింగారావు అన్నారు. మండల పరిధిలోని రేణింగవరంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభలు జరిగాయి. ఈసమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామ సభలో మొత్తం అప్లికేషన్ 15 రాగా వాటిలో పొలం ఎక్కువ వచ్చిందని 4, తక్కువ పొలం వచ్చిందని 4, జాయింట్ అకౌంట్‌పై పాస్ బుక్ వచ్చిందని 4, ఫోటో లేదని 1, పేరు మార్పు 1, వారసత్వ కొనుగోలు తేడా 1 వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సునీత, వీఆర్ఓ సుమతి, సచివాలయ సిబ్బంది, నాయకులు ఓబులరెడ్డి పాల్గొన్నారు.

పర్చూరు (చినగంజాం): భూముల రీసర్వే పూర్తయిన దేవరపల్లి గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో భూ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి 87 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. విస్తీర్ణంలో తేడాలున్నాయని 58 అర్జీలు, ఉమ్మడి భూ సమస్యలకు సంబంధించిన 27 అర్జీలు, రెండు ఇతర భూ సమస్యలకు అర్జీలను స్వీకరించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎండీ అల్తాఫ్, గ్రామ సర్పంచ్ కొరటాల సురేష్, ఎంపీటీసీ కాపు రవిచంద్ర, మండల సర్వేయర్ ఐ బాలాంజనేయులు, ఎంఆర్ఐ ప్రేమ్‌కుమార్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు రోటరీ చేయూత

చీరాల అర్బన్: సామాజిక సేవా కార్యక్రమాలలో రోటరీ క్లబ్ అన్ని వేళలా ముందుంటుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చందలూరి బాలవెంకటేశ్వరరావు అన్నారు. ఇటీవల నాగార్జున యూనివర్శిటీలో జరిగిన సౌత్ జోన్ జాతీయ స్థాయి క్రీడల్లో చీరాల ప్రాంతానికి చెందిన యశ్వంత్‌రాజు, మహాలక్ష్మిలు ఇద్దరు విద్యార్థులు పాల్గొని అథ్లెటిక్స్‌లో బ్రాంజ్ మెడల్స్‌ను సాధించారన్నారు. ఈ సందర్భంగా మంగళవారం రోటరీ క్లబ్ సభ్యులు వారిని అభినందించారు. ఒడిశాలో జరగబోయే జాతీయ పోటీల్లో వీరు పాల్గొనేందుకు రోటరీ తరుపున రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు ధనుంజయ, శ్రీనివాసరెడ్డి, రోటరీ సభ్యులు పోలుదాసు రామకృష్ణ, డాక్టర్ ఇస్సర్ల బాబూరావు, బి.హేమంత్‌కుమార్, డి.వెంకటసురేష్, మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, జివై ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న రోటరీ సభ్యులు

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

ఇంకొల్లు (చినగంజాం): ఆర్థికంగా వెనుకబడి ప్రతిభ కలిగిన విద్యార్థులకు మానవతా స్వచ్ఛంద సంస్థ చేయూతనందిస్తుందని సంస్థ ప్రెసిడెంట్ కొమ్మాలపాటి శ్రీనివాసరావు అన్నారు. ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామానికి చెందిన పల్లెపోగు అజయ్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంటెక్ చదువుతున్నాడు. ఈసందర్భంగా మంగళవారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థికి రూ.60 వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌ను అందజేశారు. శ్రీనివాసరావు మిత్రుడు సూది సుబ్బారావు, సంస్థ చైర్మన్ రమేష్, డైరక్టర్‌లు శివాజీ, యూ సాంబశివరావు, ధనుంజయరెడ్డి, ఎస్ సాంబశివరావు, శ్రీనివాసరెడ్డి, గురవారెడ్డి, సుబ్రహ్మణ్యం, సాయిరాముల ఆర్థిక సహకారంతో ల్యాప్‌టాప్‌ను సంస్థ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పేరిరెడ్డి, గ్రామ సర్పంచ్ హరనాథ్ బాబు, కొండా జఖరయ్య, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

కార్యాలయంలోకి వెళ్లేదెలా సారూ..!



చీరాల టౌన్: మండల పరిషత్ కార్యాలయంలోకి వెళ్లేందుకు వీలు లేకుండా ఎంపీడీవో తన కారును ఇలా మెట్లముందు పార్క్ చేశారు. ఎంతో ప్రజలు నిత్యం పని నిమిత్తం కార్యాలయానికి వస్తుంటారు. కారు అడ్డంగా పెట్టడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

ప్రకృతి వ్యవసాయం అన్నిరకాలా మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

చినగంజాం: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అన్ని రకాలుగా మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని సోపిరాల గ్రామంలోని రైతులకు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసేందుకు సిబ్బంది పూర్తి అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులతో పంటలు పండించిన గ్రామానికి చెందిన రైతులు తాము ఇప్పటివరకు సాగుకు అధిక పెట్టుబడులు పెట్టిన తీరును, రసాయనిక ఎరువుల వాడకం ద్వారా ఆరోగ్య పరమైన భూమి సారవంతాన్ని పోగొట్టుకోవడం గురించి సిబ్బందికి తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీఎస్ఎఫ్‌సిబ్బంది, ఇంటర్నల్ ఐసీఆర్పీలు టీ రజిని, పీ విజయానందకుమార్, డీ జ్ఞానానందం, టీ ఉదయభాస్కర్, ఎస్ ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు అవసరం



వరిలో జాగ్రత్తలు వివరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

చీరాల రూరల్: వరిపంట పొలాలపై సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని ఏవో సుమతి రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం చీరాలనగర్, కొత్తపాలెం గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వరినాట్లు వేసిన పంట పొలాలను వ్యవసాయాధికారులు సందర్శించారు. పంటలో అక్కడక్కడా ఆకుముడత పురుగు సోకడం గమనించిన అధికారులు రైతులకు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ సందీప్, వీఏఏ లావణ్య, ధీరజ్, రమ్య, అనూహ్య, రైతులు పాల్గొన్నారు.

బీమాతో ఎన్నో ఉపయోగాలు

చినగంజాం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీమా పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఏవీ శ్రీనివాసమూర్తి అన్నారు. మంగళవారం ఐటీసీ బంగారు భవిష్యత్, సెర్ప్ సంస్థల ఆధ్వర్యంలో చినగంజాం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని క్లాప్ మిత్రలందరికీ కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏవీ శ్రీనివాసమూర్తి, ఈఓపీఆర్డీ సుబ్బారావు, ఐటీసీ కమ్యూనిటీ ఆర్గనైజర్ అరుణ్ కేంద్ర ప్రభుత్వ పీఎంఎస్‌బీవై, పీఎం జేజేబీవై, పీఎంఎంవై, పీఎంజేడీవై, పీఎంఎస్ఎస్‌వై, పీఎంఏవై, పీఎంఏపీవై మొదలగు స్కీంల గురించి వివరించారు. కార్యక్రమంలో సెర్ప్ కమ్యూనిటీ ఆర్గనైజర్ సుమంత్, మండలంలోని కార్మికులు పాల్గొన్నారు.